క్లుప్తంగా

ఆర్థికసాయం



నగదు అందిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రానికి చెందిన సీనియర్ దళిత నాయకుడు కొంద్రి సంపత్ అనారోగ్యానికి గురయ్యాడు. కరీంనగర్ జిల్లా ఎస్సీ, ఎస్టీ విద్యుత్ సంఘం ఆధ్వర్యంలో నాయకులు సంపత్‌ను శుక్రవారం పరామర్శించారు. అనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందించారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కర్రోల్ల సత్యం, శ్యాం, రాము, రత్నం, సురేందర్‌రాజు, జంగం అజయ్, తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన యక్షగాన కళాకారుడు, సరస్వతి నాట్య మండలి వ్యవస్థాపకుడు బండారు శ్రీహరి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు వొడితెల ప్రణవ్‌బాబు రూ.5వేల ఆర్థికసాయం అనుచరుల ద్వారా మృతుని కుటుంబానికి అందించారు. ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆదేశాల మేరకు రూ.5వేలు సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నిమ్మల నమ్మయ్య, బీజేపీ నాయకులు పల్లెర్ల కిరణ్, కర్రె నాని ఉన్నారు.

ఇటు నిర్మాణం.. అటు కష్టాలు

- అన్నారం గ్రామంలో నూతనంగా తారురోడ్డు పనులు
- రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలతో పొంచి ఉన్న ప్రమాదం
- తొలగించని విద్యుత్ లైన్లు
- ఆందోళనలో వాహనదారులు



ప్రమాదకరంగా మూలమలుపు (ఇన్‌సెట్) బైక్‌తోపాటు డ్రైనేజీలో పడిపోయిన యువకుడు(ఫైల్)

మానకొండూర్: గ్రామాలకు తారురోడ్డు నిర్మాణం అయితే చాలా బాగుటుందనుకుంటారు ప్రజలు కానీ ఆ గ్రామస్తులకు ఇబ్బందులు మొదలయ్యాయి. రోడ్డు నిర్మించాక అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ తారురోడ్డు కంటే తక్కువ ఎత్తులో ఉండటంతో టర్నింగ్‌ల వద్ద వాహనాలు అదుపు తప్పితే నేరుగా మురుగు కాలువలో పడిపోతున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలోని అన్నారం గ్రామం మీదుగా జమ్మికుంట, కరీంనగర్‌కు నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. డబుల్ రోడ్డు మంజూరు కావడంతో గ్రామంలో నెల కిందట తారురోడ్డు పనులు పూర్తి చేశారు. అయితే తారురోడ్డు గ్రామంలో చాలా ఎత్తుగా నిర్మించారు. గ్రామంలో రహదారికి ఇరువైపుల మురుగుకాలువల నిర్మాణ పనులు ఎనభై శాతం పూర్తి చేశారు. మురుగు కాలువలు రహదారి పక్కన తక్కువ ఎత్తులో నిర్మించడంతో మూలమలుపుల వద్ద వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామానికే చెందిన ఓ యువకుడు ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళ్తూ వాహనంతో పాటు డ్రైనేజీలో పడిపోయాడు. అదృష్టవశాత్తు గాయాలతో బయటపడ్డాడు. గల్లీల నుంచి రహదారిపైకి వచ్చేటప్పుడు ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఒక్కోసారి రోడ్డు ఎత్తుగా ఉండటంతో వెనక్కి వెళ్తున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లైన్లు తొలగించకుండానే రోడ్డు నిర్మాణం చేపట్టడంతో భారీ వాహనాలు వెళ్లే సమయంలో తీగలు వాహనాలకు తగులుతున్నాయని వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. ఇటీవల ఓ లారీకి తీగలు తగలడంతో విద్యుత్ వైర్లు తీసి మళ్లీ సరిచేయాల్సిన పరిస్థితి వచ్చింది. గల్లీ నుంచి రోడ్డుపైకి వచ్చే ప్రదేశంలో డ్రైనేజీపై స్లాబ్ వేయాలని, రహదారి మురుగుకాలువ మధ్యలో మట్టి నింపాలని, రోడ్డుపై అక్కడక్కడ స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేసి వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వాహనదారులు బెంబేలెత్తుతున్నారు



ఇటీవల ఓ యువకుడు ద్విచక్ర వాహనంతో మురుగు కాలువలో పడి గాయాలపాలయ్యాడు. ముదిరాజ్ సంఘం భవన సమీపంలో మూలమలుపుతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. అదుపు తప్పితే అంతే సంగతి. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– రామగిరి సంపత్, అన్నారం

ఇబ్బందులు లేకుండా చూస్తాం

గ్రామంలో తారురోడ్డు నిర్మాణం చేపట్టాం. విద్యుత్ స్తంభాలను తొలగిస్తాం. అలాగే రోడ్డు పక్కన ప్రమాదకరంగా డ్రైనేజీ వ్యవస్థ ఎక్కడుందో అక్కడ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

– దానగొండ రాజశేఖర్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

పెంచిన వేతనాలు చెల్లించాలి

వీణవంక: మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ సాహెబ్‌హుస్సేన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడారు. రూ. మూడువేలకు పెంచుతానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి ఎనిమిది నెలలు గడిచినా ఇంతవరకు అతీగతి లేదని, అప్పులు తెచ్చి వంటలు వండుతున్నారని ఆరోపించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



మానకొండూర్‌రూరల్: మండలంలోని వెల్ది, లక్ష్మీపూర్, రంగపేట గ్రామాల్లో ఊటూర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ సీఈవో రవీందర్ ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులతో మోసపోవద్దన్నారు.

పరామర్శ

రామడుగు: మండలంలోని వెదిర గ్రామానికి చెందిన భైరీ రాజు మృతిచెందగా ఆయన కుటుంబాన్ని శుక్రవారం కురుమ సంఘం చొప్పదండి నియోజకవర్గ అధ్యక్షుడు ఒగ్గు మల్లేశం ఆధ్వర్యంలో నాయకులు పరామర్శించారు. కుటుంబానికి న్యాయం చేయాలని సంఘం ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఐలయ్య, సలహాదారులు లచ్చయ్య, ప్రధాన కార్యదర్శి గట్టయ్య, నాయకులు వీరయ్య, సతీశ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గెలుపు కోసం బాధ్యతగా పనిచేయాలి

- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

మానకొండూర్: బీఆర్‌ఎస్ గెలుపు కోసం బాధ్యతంగా పనిచేయాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మానకొండూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో బూత్ ఇన్‌చార్జి, కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో 137 మంది సర్పంచులు, 67 మంది ఎంపీటీసీలు వందలాది కార్యకర్తలు, అభిమానులు పార్టీలో ఉన్నారని, ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించాలన్నారు. చెప్పుడుమాటలు నమ్మొద్దని, తెలంగాణ ఉద్యమంలో జై తెలంగాణ అనాలంటే భయపడి కవ్వంపల్లి సత్యనారాయణ పిరికిపంద అని, నేను గెలుస్తున్నానని, గతరాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు బీభత్సవం సృష్టించారని, రాబోయే ఎన్నికల్లో 65 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తానన్నాడు. కాంగ్రెస్ పథకాలకు గ్యారంటీ లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ మొన్నటి వరకూ బీఆర్‌ఎస్‌లో ఉండి ఎమ్మెల్యే సీటు ఇవ్వకపోతే, బీజేపీలోకి వెళ్లిపోయాడని మీరు అలా చేయవద్దని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న కవ్వంపల్లి సత్యనారాయణకు ఎన్నికల్లో 25 వేల ఓట్లు వస్తే నేను ఎమ్మెల్యేగా గెలిచినా రాజీనామా చేస్తానని రసమయి బాలకిషన్ సవాల్ విసిరారు. గతంలో అయనకు నామమాత్రపు ఓట్లు పడ్డాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచులు నల్ల వంశీధర్‌రెడ్డి, రొడ్డ పృథ్వీరాజ్, దేవ సతీష్‌రెడ్డి, రామంచ గోపాల్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు నల్లగోవిందరెడ్డి, ముద్దసాని ప్రదీప్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం తిమ్మాపూర్ మండలంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు సమక్షంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే, జీవీఆర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి అంజనేయులు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు చింతల రవి, గ్రామశాఖ అధ్యక్షులు పంజాల ఎల్లయ్య, న్యాలపట్ల శంకర్, ముల్కల లక్ష్మణ్, ఆశోక్, ముల్కల అజయ్, ముల్కల సంతోష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదు

హుజూరాబాద్: ఓట్ల కోసం పాట్లుపడుతున్న బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మాట్లాడిన వ్యాఖ్యలను వక్రీకరించి బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. గత ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

గంగాధర: మండలంలోని నాగిరెడ్డిపూర్ గ్రామ మాజీ సర్పంచ్, గంగాధర సహకార సంఘం డైరెక్టర్ ఆకుల ఆంజనేయులు, కురుమ యాదవ సంఘం మాజీ అధ్యక్షుడు ఐలయ్య శుక్రవారం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం గంగాధర పార్టీ కార్యాలయంలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

విద్యా, వైద్యం, ఉపాధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్



మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్‌గౌడ్

చిగురుమామిడి: రాష్ట్రంలో విద్యా, వైద్యం, ఉపాధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం చిగురుమామిడిలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తుందని జోస్యం చెప్పారు. ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందన్నారు, కాంగ్రెస్ పాలనలోనే సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి క్రిస్టోఫర్ తిలక్ మాట్లాడుతూ కార్యకర్తలు ప్రజలకు ఆరు గ్యారంటీ పథకాలను వివరించాలని కోరారు. రోడ్లు, సాగునీరు, ప్రాజెక్టుల పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దోచుకుంటోందన్నారు. 35 రోజుల్లో తెలంగాణ తలరాత మారబోతోందన్నారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, అధికార ప్రతినిధులు బరెడ్డి సత్యనారాయణరెడ్డి, దాసరి ప్రవీణ్‌కుమార్, మండల ఇన్‌చార్జి ఎస్ఎల్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు బస్వారాజ్ శంకర్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఓరుగంటి భారతీదేవి, నాయకులు పోలు స్వప్న, యాదగిరి, షాబొద్దీన్, మహిపాల్‌రెడ్డి, ఠాకూర్, బోయిని వేణు, పూదరి వేణు, నరేశ్ పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదు

- కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్: పోలీసులు అక్రమ కేసులు పెడితే భయపడేది లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్‌లో శుక్రవారం మాట్లాడారు. గురువారం రాత్రి తిమ్మాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే సమాచారంతో ఎన్నికల అధికారుల సూచన మేరకూ లోకేషన్ షేర్ చేయడానికి కాంగ్రెస్ కార్యకర్తలు వెళ్తే అక్కడికి చేరుకున్న సీఐ, ఎస్సైలు బూతులు తిట్టారని ఆరోపించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌ను బెదిరించారని, నాయకులపై అక్రమ కేసులు పెట్టారని పోలీసులపై మండిపడ్డారు. సీసీ ఫుటేజీలు బహిర్గతం చేయాలని, సీఐ, ఎస్సైలను బదిలీ, సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి దొంగ అనడటం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడికి తగదన్నారు. హుజూరాబాద్ ఎన్నికల్లో రైస్‌మిల్లులు, కాలేజీల్లో డబ్బులు పట్టుబడిన విషయం మరిచారా అంటూ విమర్శించారు. ఎలక్షన్ కోడ్ ఉండగా దిష్టిబొమ్మలు ఎలా దహనం చేస్తారని, ఎన్నికల కమిషనర్, కలెక్టర్, సీపీలకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో రవీంద్రాచారి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ సంపత్, శ్రీనివాస్‌రెడ్డి, తాళ్లపల్లి సంపత్‌గౌడ్, రామిడి తిరుపతి, రామిడి తిరుమల్‌రెడ్డి, సాయిరి దేవయ్య పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని గుడాటిపల్లి, మక్త గ్రామాల్లో కవ్వంపల్లి సత్యనారాయణ గడప గడపకు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. అధికారంలోకి రాగానే పథకాలు అమలు చేస్తామన్నారు.

స్థానికేతరుల మాటలతో మోసపోవద్దు

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



ప్రచారంలో ఓటు అడుగుతున్న రవిశంకర్

గంగాధర: రాష్ట్రంలోని అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటు వేయండని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. మండలంలోని హిమ్మత్‌నగర్, గట్టుభూత్కూర్, చిన్నాచంపల్లి, ఆచంపల్లి,వెంకంపల్లి, కాసారం గ్రామాలలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికుడిగా ఎప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని, ఒకసారి అవకాశమిస్తే రూ. వందల కోట్లతో అభివృద్ధి పనులు చేశాను, స్థానికేతరులు వచ్చి ఓట్లు అడుగుతారు, వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే రైతుబంధు, ఆసరా పెన్షన్ పెంచడంతో పాటు గ్యాస్ ధర తగ్గిస్తుందన్నారు. ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి బీఆర్‌ఎస్ పెద్దపీట



బొమ్మనపల్లి గ్రామంలో మాట్లాడుతున్న ఎంపీపీ కొత్త వినీతారెడ్డి

చిగురుమామిడి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, రాబోయే ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేయాలని ఎంపీపీ కొత్త వినీతారెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో పార్టీ మహిళా కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. మహిళల కోసం సౌభాగ్యలక్ష్మి పథకాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చారని, 29న హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ చిగురుమామిడి మండలంలో పర్యటిస్తారని, మహిళలు, యువకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అందె సుజాత, ఉప సర్పంచ్ పెండ్యాల శారదసదానందం, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ కొమ్మెర మంజుల, మాజీ ఎంపీటీసీ రాజేశ్వరీ, చట్ల సరవ్వ, తాల్ల ప్రమీల, స్వరూప, లక్ష్మి, అరుణ, రాజేశ్వరి, సుజాత పలువురు పాల్గొన్నారు.

'తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నాం'

జమ్మికుంట: ఎన్నికలు సందర్భంగా ప్రజలను ప్రలోభాలకు గురిచేయకుండా రైతుబంధు, రుణమాఫీ, పెన్షన్, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు నవంబర్ 2 లోపు ఇవ్వాలని ఎలక్షన్ కమిషన్ మెమోరాండం ఇవ్వడాన్ని బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరిస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని స్వగృహంలో మాట్లాడారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, దిష్టిబొమ్మ దహనాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వెంకన్న, మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, మండల, పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షులు రమేశ్, ప్రభుదాస్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వాన్ని గద్దెదించాలి'



మాట్లాడుతున్న వాసుదేవ రెడ్డి

తిమ్మాపూర్: ఇచ్చిన హామీలు నెరవేర్చని బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. తిమ్మాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలు తప్పా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. తిమ్మాపూర్ నుంచి పోరండ్ల మీదుగా చెంజర్ల వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జోన్ కార్యదర్శి సంపత్, సభ్యులు శంకర్, ఐలయ్య, పవన్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

హుజూరాబాద్: కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా వొడితెల ప్రణవ్‌కు అధిష్టానం రెండో జాబితాలో చోటు కల్పించడంతో నియోజకవర్గ వ్యాప్తం నాయకుల సంబరాలు అంబరాన్నంటాయి. హుజూరాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కేంద్రం నిధులతోనే రాష్ట్రం అభివృద్ధి

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్, ధర్మారం, గద్దపాక గ్రామాల్లో బీజేపీ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరెపల్లి మోహన్ శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం గద్దపాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు నియోజకవర్గ అభివృద్ధిపై ధ్యాస లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యేగా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు అనిల్, నాయకులు వెంకట్‌రెడ్డి, కొమురయ్య, సమ్మిరెడ్డి, రాజిరెడ్డి, నరేందర్, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

కోలాటం, ఒగ్గుడోలు బృందాలతో స్వాగతం



ఎన్నికల ప్రచారంలో సతీశ్‌కుమార్

సైదాపూర్: ఎమ్మెల్యేగా మూడోసారి ఆశీర్వదించండి, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని హుస్నాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్ ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం మండలంలోని లస్మన్నపల్లి, వెన్నంపల్లి, ఆరెపల్లి, బూడిదపల్లి, సోమారం, గర్రెపల్లి, ఎగ్లాస్‌పూర్, దుద్దెనపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో మహిళల కోలాటం, ఒగ్గుడోలు బృందాలతో సతీశ్‌మార్‌కు స్వాగతం పలికారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధిని వివరించారు. మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రచారంలో భాగంగా ఎన్నికల మేనిఫెస్టో చదివారు. పదేళ్లలో పైసా పని చేయలేదని, రోడ్డుతెగినా తట్టెడు మట్టి పోయలేదని గర్రెపల్లిలో యువకులు, మహిళలు ఎమ్మెల్యేను నిలదీశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజయ్య, ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండోల చైర్మన్లు తిరుపతిరెడ్డి, వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా గెలిపించండి

చొప్పదండి: ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి బొడిగె శోభ కోరారు. రుక్మాపూర్, కొలిమికుంట, చాకుంట, వెదురుగట్ట, భూపాలపట్నం, ఆర్నకొండ, గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

బీఆర్‌ఎస్ నాయకుల ధర్నా



చిగురుమామిడిలో దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చిగురుమామిడి: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. హుస్నాబాద్–కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి కాంగ్రెస్ నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సంక్షేమ పథకాలు ఆపాలని ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ లేఖ రాయడంపై నిరసన తెలుపుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యుడు కొంరయ్య, సింగిల్‌విండో వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి రాంబాబు, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, కృష్ణమాచారి, సర్పంచులు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల కోసమే 'డీఎస్పీ'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి చిలువేరు రాకేశ్

హుజూరాబాద్: బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడటానికి ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) ఏర్పడిందని పార్టీ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి చిలువేరు రాకేశ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఎన్నికల్లో పార్టీ 119 నియోజకవర్గాల్లో పోటీ చేయబోతుందని, తనపై నమ్మకంతో ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహారాజ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలకు అన్ని రకాలుగా సేవలందిస్తానన్నారు. టార్చ్‌లైట్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. నవంబర్ మొదటి వారంలో పార్టీ మేనిఫెస్టో ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు రాకేశ్, మల్లు, రాజు, నది, ఆశోక్, శ్రీనివాస్, సందీప్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మద్యం అమ్మకాలు జరిపితే చర్యలు

జమ్మికుంట: ఎన్నికల నియమావళి ఉల్లంఘించి, మద్యం, గుడుంబా అమ్మకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని జమ్మికుంట ఎక్సైజ్ సీఐ అక్బర్ హుస్సేన్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జమ్మికుంట ఎక్సైజ్ పరిధిలోని జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాల్లో ఇప్పటివరకు 70 కేసులు నమోదు చేశామని, 29 లీటర్ల నాటుసారా, 2,999 లీటర్ల బెల్లం పానకం, 119 కిలోల బెల్లం, 22.88 లీటర్ల మద్యం, 26 లీటర్ల బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, 128 మందిని ముందస్తుగా తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశామన్నారు. అమ్మకాలు సాగిస్తే 87126 58812 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. జమ్మికుంట పట్టణానికి చెందిన 18 మందిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ రజనీ ఎదుట శుక్రవారం బైండోవర్ చేశామని టౌన్ సీఐ బార్పటి రమేశ్ తెలిపారు. రాబోయే ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా బైండోవర్, కేసులు నమోదు చేశామని వివరించారు.

హుజూరాబాద్‌రూరల్: అక్రమంగా మద్యం విక్రయాలు జరిపితే శాఖాపరమైన చర్యలు తప్పవని హుజూరాబాద్ ఎక్సైజ్ సీఐ దుర్గాభవాని తెలిపారు. శుక్రవారం ఎక్సైజ్ పరిధిలోని హుజూరాబాద్, కేశవపట్నం, సైదాపూర్ మండలాల్లో గుడుంబా తయారీ స్థావరాలపై దాడులు జరిపి 5,330 లీటర్ల బెల్లం పానకం, 120 కిలోల బెల్లం ధ్వంసం చేశామని, 31 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. ఆయా గ్రామాల్లోని మద్యం విక్రయ స్థావరాలపై దాడులు జరిపి 227 లీటర్ల మద్యం స్వాధీనం, 27 మందిపై కేసు నమోదు చేసి, ఎన్నికల నియమావళి కింద 34 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కందుగుల గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు ఇప్పలపల్లి హరికృష్ణ, శివమణి నాలుగు నెలల క్రితం మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులను సామాజిక కార్యకర్త సబ్బని వెంకట్ పరామర్శించారు. హరికృష్ణ పని చేసిన సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి ఇన్సూరెన్స్ డబ్బులు వచ్చేలా కృషి చేశారు. శుక్రవారం రూ.63 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు. వెంకట్‌కు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

రామడుగు: హరిత తెలంగాణ సాధన కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు కోరారు. వివాహ వార్షికోత్సవం పురస్కరించుకొని మండలంలోని వెలిచాల శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. ఎంపీ సంతోష్‌కుమార్ గ్రీన్ చాలెంజ్‌ను స్ఫూర్తిగా తీసుకొని కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వీర్ల కవిత, తదితరులు పాల్గొన్నారు.

బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మనోహర్

గంగాధర: బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని వెంకంపల్లి గ్రామానికి చెందిన అకుల మనోహర్‌ను సంఘం జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు మాదాసు సంజీవ్ శుక్రవారం నియమించారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు మనోహర్ కృతజ్ఞతలు తెలిపాడు. బీసీల సమస్యలు పరిష్కారంతో పాటు బీసీ రుణాల మంజూరు కోసం పోరాటం చేస్తానన్నారు.